క్లుప్తంగా

వైభవంగా సమర్థనారాయణ ఆరాధన

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పరపల్లె గ్రామం శ్రీసద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమంలో శ్రీసద్గురు సమర్థనారాయణ మహారాజుల 35 ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం శ్రీలక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నవగ్రహ, చండీ హోమాలను వేద పండితులు నిర్వహించి 108 ప్రత్యేక ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమాధిపతి గోపాలస్వామి మాట్లాడుతూ ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీనారాయణ మహారాజుల వారి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

మహిళా పోలీస్‌లకు సన్మానం

అట్లూరు : ఐదేళ్లుగా విధులు నిర్వర్తిస్తూ బదిలీ అయిన మహిళా పోలీసు(గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి)లకు స్థానిక ఎస్‌ఐ రామకృష్ణ శనివారం ఘనంగా సన్మానం చేశారు. అట్లూరు సచివాలయ పరిధిలోని విజయలక్ష్మి, కొండూరు సచివాలయం వాణి, కుంభగిరిలోని ఇంద్రావతి, ముత్తుకూరుకు చెందిన శిరీషా, కమలకూరులో పని చేస్తున్న మౌనికకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో స్థానచలనం జరిగింది. ఈ సందర్భంగా వారికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ చంద్రశేఖర్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధికి దోహదం

బద్వేలు అర్బన్ : జాబ్‌మేళా ద్వారా విద్యార్థులు తమలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుపడుతుందని ఎస్ఆర్ఎస్‌బీ డిగ్రీ కళాశాల ఏఓ ఆర్.వి.సాయిక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో సియెట్ కంపెనీ సహకారంతో జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 60 మంది విద్యార్థులు పాల్గొనగా ఇంటర్వ్యూల ద్వారా 38 మందిని ఎంపిక చేసి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి రూ.3 లక్షల వేతనంతో చెన్నైలో పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సియెట్ కంపెనీ హెచ్ ఆర్‌ఓ కె.ఎస్.హరిక్రిష్ణ, ఎల్.రాఘవేంద్ర, కళాశాల అధ్యాపకులు డాక్టర్ అశోక్, లక్ష్మీదేవి, కబీర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పోరుమామిళ్ల : రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డికి అన్న, కలసపాడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజశేఖరరెడ్డికి తండ్రి అయిన బాలిరెడ్డి ఇటీవల గుండెకు సంబంధించిన చికిత్స పొంది పోరుమామిళ్లలో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఇంటికి శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వెళ్లారు. బాలిరెడ్డి ఆరోగ్యం, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ వెంట వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ ఇస్సాక్, జిల్లా పార్టీ అనుబంధ విభాగాల నాయకులు రాజారెడ్డి, గిరిప్రణీత్‌రెడ్డి, సాయి నారాయణరెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠం పరిధి పాతూరు గ్రామంలోని రామాలయంలో నాలుగు రోజుల పాటు టీటీడీ ప్రచారకర్త చాపాటి వెంకటసుబ్బారెడ్డి చేసిన ధార్మిక ప్రసంగం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. ధార్మిక ప్రసంగం వల్ల చాలా మంచి విషయాలు తెలుసుకున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమాలు టీటీడీ ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో గ్రామస్తులు రోశమ్మ, మాధవనాయుడు, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, ఇటికల రవికుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ స్కీం కింద పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి యూనియన్ గౌరవ అధ్యక్షుడు రాఘవ కోరారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌కు వారు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు ఈనెల 9న సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రత్నమ్మ, కళావతి, నరసింహులు, గంగాధర్, మహేష్, దస్తగిరి, ప్రసాద్, మరియమ్మ, దేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగ కాలనీ రోడ్డులోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలో శనివారం డాక్టర్ దాసరిశ్రీను ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా అనాథ వృద్ధులు, వికలాంగులకు డాక్టర్ దాసరిధరణి ఇంద్రసీలమణి, డాక్టర్ భరణిశ్రీహంసిని ఆధ్వర్యంలో బీపీ, షుగర్ పరీక్షలతోపాటు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దాసరిశ్రీను, ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసపూరిత మేనిఫెస్టోను గుర్తు చేద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి
- 14 నుంచి మండల స్థాయి సమావేశాలు
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు


చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, రఘునాథరెడ్డి

మైదుకూరు : చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షతన పార్టీ మైదుకూరు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేసే క్యూఆర్ కోడ్ ఉన్న పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల కారణంగా ఏ కుటుంబానికి ఎంత నష్టం జరిగింది.. ఎంత మేరకు మోసపోయామనే విషయం ప్రజలకు తెలుసు అని అన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు చంద్రబాబు మోసాన్ని గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉన్నది.. ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉంది అనేది వివరించాలని సూచించారు. చంద్రబాబుకు రాష్ట్రంలో ఎల్లో మీడియా ఎంతో సహకరిస్తోందని, అబద్ధాలను నిజంగా మారుస్తూ ప్రజలకు చేరవేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలన్నారు. 2014లో 695 హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చి అవి నెరవేర్చలేదని విమర్శించారు. అయినా ప్రజలు వాటిని మరిచిపోయి 2024లో 140 హామీలు ఇస్తే నమ్మి ఓటు వేశారని పేర్కొన్నారు. గోబెల్స్ సిద్ధాంతాన్ని రాజకీయాల్లో ఉపయోగించుకునే ఏకైక వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. హామీలపై తాను చెప్పేది అబద్ధాలని చంద్రబాబుకు తెలుసు అన్నారు. అయితే ప్రజలు నమ్మే విధంగా మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ ఏడాదిలో చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయలేదని, ఎక్కడా అభివృద్ధి అనేది లేదని విమర్శించారు. అయినా ఏడాదికే రూ.1.70 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు. ఏడాదిలో ప్రజలకు పథకాల ద్వారా ఇవ్వాల్సిన బాకీ రూ.84 వేల కోట్లు అవుతుందని.. వడ్డీతో కలిపితే రూ.లక్ష కోట్లు అవుతుందన్నారు.

టీడీపీ నేతలను ప్రజలు నిలదీయాలి

హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలపై ఈ నెల 14 నుంచి మైదుకూరు నియోజకర్గంలో ప్రతి మండలంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఏమి చేయకుండానే చంద్రబాబు సుపరిపాలన పేరుతో ఇంటింటికి తిరుగుతున్నారని ఆయన విమర్శించారు. 14వ తేదీ నుంచి మండల స్థాయి సమావేశాలు నిర్వహించి చంద్రబాబు చెప్పిన హామీలను గుర్తు చేసి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. సుపరిపాలనలో తొలి అడుగుపేరుతో తమ ఇళ్ల వద్దకు వచ్చే టీడీపీ వారిని నిలదీయాలని చెబుదామన్నారు. హైటెక్ అంటూ చెప్పే చంద్రబాబు వ్యవసాయం దండగనే చెబుతూ వచ్చారని ఆరోపించారు. అందువల్లే రైతుకు ఏమీ చేయలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాఫ్ ఇన్సూరెన్స్, గిట్టుబాటు ధరలతో రైతులను ఆదుకున్నామని వివరించారు. ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ నిలదీస్తేనే తల్లికి వందనం పేరుతో ఎంతో కొంత అందించారన్నారు. సమావేశంలో ఉద్యాన శాఖ రాష్ట్ర మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డి.శ్రీనివాసుల రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లె శివరాం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మదీనా దస్తగిరి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.కిరణ్మయి, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ సమావేశం

బద్వేలు అర్బన్ : బద్వేలు – కడప రహదారిలోని బయనపల్లె సమీపంలో గల బొజ్జిరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 3–30 గంటలకు వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పార్టీ మున్సిపాలిటీ, ఆయా మండలాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు, చేపట్టవలసిన కార్యాచరణ, బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం కార్యాచరణపై చర్చించడం జరుగుతుందని వారు తెలిపారు.

విజయవంతం చేయాలి

అట్లూరు : రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ల విడుదల కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

మాతృమరణంపై విచారణ

బద్వేలు అర్బన్ : తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అనంతరాజపురం పంచాయతీ గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీలో గత నెల 29న జరిగిన మాతృ మరణంపై శనివారం డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో నియమించబడిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్రీయ బాలసురక్ష కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్‌ల నేతృత్వంలో పీహెచ్‌సీ వైద్యాధికారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో పాటు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, ప్రైవేటు వైద్యశాలల వైద్యులను విచారించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంట్లో కాన్పులు చేయడం చాలా ప్రమాదకరమని, ప్రతి కాన్పు ఆసుపత్రిలోనే జరగాలని, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకొని వెళ్లేందుకు 108 ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కాశినాయన : మండలంలోని ఎంపీపీ పాఠశాలల విద్యార్థులకు పోరుమామిళ్ల చిత్తా శౌరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు, ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి 1785 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పిట్టికుంట, నరసాపురం, మూలపల్లి, మిద్దెల, గంగనపల్లె, ఆకులనారాయణపల్లె, గుంటువారిపల్లె, నాయునిపల్లి, కొండ్రాజుపల్లె, కేఎస్‌కొట్టాలపల్లె గ్రామాల్లో చదువుతున్న 595 మంది విద్యార్థులకు శనివారం అందజేశారు. సంస్థ నిర్వాహకులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టడం తగదు

- బెదిరించి పార్టీ మారేలా చేసుకున్నారు
- టీడీపీపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం

కాశినాయన : అధికార పార్టీ నేతలు రైతులను ఇబ్బంది పెట్టి.. పార్టీ మారేలా చేయడం తగదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమాచార కమిటీ సంయుక్త కార్యదర్శి ఎలిచర్ల నాగసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి విమర్శించారు. శనివారం వారు సాక్షితో మాట్లాడారు. సావిశెట్టిపల్లె గ్రామంలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లాయని, ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి షాక్ ఇచ్చామని టీడీపీ నాయకులు సంబరపడుతున్నారని ఎద్దేవా చేశారన్నారు. వాస్తవంగా నాలుగు కుటుంబాలే పార్టీ మారాయని చెప్పారు. గ్రామానికి చెందిన రైతులు పొలంలో బోరు వేసుకుని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకుని అరటి, జామ పంటలను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరకు వారు బాగానే పంటలు పండించుకుని జీవనం సాగించే వారని పేర్కొన్నారు. అయితే విద్యుత్ సరీ్వసు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఎలా ఏర్పాటు చేశారని గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వారిని బెదిరించారని ఆరోపించారు. విద్యుత్ అధికారుల ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్‌ను తొలగించి రైతులను ఇబ్బంది పెట్టి పార్టీ మారేలా చేసుకోవడం తగదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసి పార్టీలను మార్పించుకోవడం మానుకోవాలని హితవు పలికారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, ఇప్పుడు కూటమి నాయకులు గ్రామాల్లో చిచ్చు రేపి ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అటువంటి పనులను మానుకోవాలని వారు సూచించారు.

నిరుద్యోగులకు కూటమి మోసం

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని అంత వరకు ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగభృతి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. శనివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీలు అమలు చేయకుండా నిరుద్యోగులను మోసగించిందని విమర్శించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ కార్యదర్శి బి.మధు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే జూలై 11న కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే జూలై 15న చలో విజయవాడ జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురుమూర్తి, వీరమ్మ, జ్యోతి, సురేష్, రాజేష్, ప్రభాకర్, సాగర్, మహేంద్ర, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరం స్లాట్ కోసం పడిగాపులు

మైదుకూరు : సదరం శిబిరంలో సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు శనివారం దివ్యాంగులు మీ సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. అర్హులైన వారు సదరం క్యాంప్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో స్థానిక మీ సేవా కేంద్రాల వద్దకు చేరుకున్న దివ్యాంగులకు సర్వర్ పనిచేయకపోవడంతో నిరాశే ఎదరైంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం భోజనానికి కూడా వెళ్లకుండా సాయంత్రం వరకు మీ సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద వేచి ఉన్న వారికి సర్వర్ పని చేయడం లేదని సమాధానం చెప్పారు. ఆదివారమైనా సర్వర్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, దివ్యాంగులను ఇబ్బందులు పెట్టవద్దని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌బీ సుబ్బారావు ప్రభుత్వాన్ని కోరారు.

మాదిగల ఉద్యమం మరింత ఉధృతం

పోరుమామిళ్ల : ఎమ్మార్పీఎస్ ఉద్యమం మాదిగల హక్కులు, గుర్తింపు, గౌరవానికి మార్గదర్శిగా నిలిచిందని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సభ్యులు శోభన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మాదిగ దండోరా జెండాల పంపిణీ కార్యక్రమం ఆయన నియోజకవర్గ వ్యాప్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఊరిలో ఉద్యమ జెండా ఎగురవేయాలని, మాదిగ ఉద్యమ శక్తిని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఈ నెల 7న మాదిగ దండోరా ఆవిర్భావ దినోత్సవాన్ని, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దండోరా నాయకులు ఈశ్వరయ్య, నర్సింహులు, మనోజ్‌సాగర్, జాకోబ్, ప్రసాద్, ఆనంద్, బాల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఐఎంఏ భవనంలో శనివారం డాక్టర్ బీసీ రాయ్ జయంతిని పురస్కరించుకుని జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్ ఎం.బుసిరెడ్డి, ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ త్యాగరాజరెడ్డి, సెక్రటరీ డాక్టర్ సాయిప్రసాద్, ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

కాశినాయన : మండలంలోని పలు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు నిర్వహించారు. వరికుంట్ల, బాలాయపల్లె, గొంటువారిపల్లె గ్రామాల్లో పగలు సర్గేసు ఘనంగా న్విహించారు. సాయంత్రం పీర్లను ప్రత్యేకంగా పూలతో అంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

గోపవరం : మండలంలోని రాచాయపేటలో చిన్నసరిగెత్తు సందర్భంగా శనివారం తెల్లవారుజామున పీర్లను గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పైటపీరును గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సుందరాచార్యుల వీధిలోని పీర్ల చావిడిలో పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పీర్లను దర్శించుకుని ప్రదక్షణలు చేసి టెంకాయ, చక్కెర, బూంది చదివింపులు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలు పీర్ల చావిడలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.


కాశినాయన : వరికుంట్లలో పీర్ల ఊరేగింపు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. చిన్న పీర్లతోపాటు బాబా పక్రుద్దీన్ స్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించారు. అర్ధరాత్రి దాటాక బ్రహ్మయ్య స్వామి, మరి కొంతమంది యువకులు ఎత్తుకొని వీధుల్లో ఘనంగా ఊరేగించారు. స్వామి తమ ఇంటి వద్దకు రాగానే బిందెలతో నీళ్లు పోసి టెంకాయలు కొట్టారు. ముందుగా గుండం వద్ద పెద్ద ఎత్తున మంటలు వేశారు. అనంతరం కొంత మంది ఆగుండంలో నడుచుకుంటూ వెళ్లారు.

అస్తవ్యస్తంగా రేషన్ సరుకుల పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్ : ప్రస్తుతం చౌకాణం వద్ద డీలర్ల ద్వారా రేషన్ సరకులు చేసే పంపిణీ అస్తవ్యస్తంగా ఉందని, గత ప్రభుత్వం లాగే ఎండీయూ వాహనాల ద్వారానే చేపట్టాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కోరారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో శనివారం ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. ఏ ఒక్క డీలర్ పాటించడం లేదన్నారు. ఎంపీపీ శేఖర్ యాదవ్ మాట్లాడుతూ డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి సరుకుల పంపిణీపై వేలిముద్రలు వేయించుకుని ఇళ్ల వద్ద ఇవ్వకుండా రేషన్ షాపుల వద్దకు రావాలని చెబుతున్నారన్నారు. ఎక్కువ మంది ప్రజలు కోరుకునే ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ సరుకుల పంపిణీ చేసేలా అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సభ్యులు ఇంకా పలు సమస్యలు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, వెలుగు ఏపీఎం వెంకటసుబ్బమ్మ, ఎంఈఓ సావిత్రమ్మ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బాలన్న, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు క్రైం : లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కక్షిదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, రెండవ అదనపు జిల్లా జడ్జి ఆధ్వర్యంలో మూడు బెంచీలను ఏర్పాటు చేశారు. మొదటి బెంచి రెండవ అదనపు జిల్లా జడ్జి కె.సత్యకుమారి, రెండవ బెంచి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ.ప్రతిభ, మూడవ బెంచి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సరేంద్ర రెడ్డి 46 క్రిమినల్ కేసులు, 114 సివిల్ కేసులను మొత్తం 160 కేసులు పరిష్కారమయ్యాయి.

రాజీ మార్గమే ఉత్తమం

బద్వేలు అర్బన్ : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని, ఇందుకు లోక్ అదాలత్ సహకరిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.ముఖేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మూడు బెంచిలను ఏర్పాటు చేశారు. 450 క్రిమినల్ కేసులు, 21 సివిల్ కేసులు, 3181 ఎస్‌టీసీ కేసులు మొత్తం 3652 కేసులు పరిష్కరించి రూ.95,00,751లు బాధితులకు అందజేసినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్‌లు, పోలీసులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలపై ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

ప్రొద్దుటూరు : ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గేట్ మీటింగ్ ఏర్పాటు చేసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బీవీపీ రెడ్డి, పీఎస్‌పీ రెడ్డి, ఆర్ఎస్ రెడ్డి, వెంకటేష్, రామలింగారెడ్డి, బీసీ శేఖర్, రమణ, వీఆర్ఎస్ రెడ్డి, శివ, శంకర్, డీవీఎస్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, మక్బుల్ బాషా, రాయుడు, సుబ్బయ్య, అనీస్, ఆర్‌డీ బాబు, పార్వతమ్మ, సుప్రజ, లీలావతి, ఇమాంబీ పాల్గొన్నారు.

రెండో రోజూ ధర్నా

మైదుకూరు : సమస్యల పరిష్కారం కోసం మైదుకూరు డిపోలో రెండో రోజైన శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ధర్నాలో ఈయూఏ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున, డిపో కార్యదర్శి టీపీ మునెయ్య, అధ్యక్షుడు నారాయణ, బీఎస్ రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి పుల్లారెడ్డి, కుల్లాయప్ప పాల్గొన్నారు.


ఆర్టీసీ డిపో వద్ద ఈయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : ఖాళీగా ఉన్న కండక్టర్, డ్రైవర్ పోస్టులను భర్తీ చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బోసుబాబు పేర్కొన్నారు. స్థానిక గ్యారేజీ గేటు ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి మహిళా జిల్లా సెక్రటరీ విజయమ్మ, రీజనల్ కమిటీ మెంబర్ ఎస్.వి.కె.రెడ్డి, డిపో సెక్రటరీ బి.పి.నరసింహులు, డిపో నాయకులు నాగరాజు, మణ్యం, పెంచలయ్య, రసూల్, శ్రీను పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడంలో భాగంగా ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపును అదానీ కంపెనీకి అప్పజెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, సభ్యులు శివారెడ్డి, రామకృష్ణ, నరసింహ, శ్రీను, దస్తగిరి, ప్రమీల, సుజాత, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని కోరుతూ మైదుకూరు విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏడీఈ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ధర్నాలో సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పి.శ్రీరాములు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, సీపీఐ పట్టణ కార్యదర్శి డి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి కె.జయరాజు, ఏఐటీయూసీ నాయకులు బి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మైదుకూరు : మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు సూచించారు. మండల సభా భవనంలో శనివారం ఎంపీపీ థామస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులనుద్దేశించి ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యాన్ని నెలకొల్పేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ డీలర్లు 5వ తేదీలోపు అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవడం, కొన్ని శాఖలకు సంబంధించిన అధికారులకు బదులు సిబ్బంది హాజరు కావడంతో మండల సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మూడు నెలలకోసారి సమస్యలను నివేదించేందుకు సమావేశాలు నిర్వహిస్తే.. అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ ఇప్పటికే చాలా సార్లు అధికారులకు చెప్పామని, ఇకపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సభ్యులకు హామీ ఇచ్చారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, జెడ్పీటీసీ ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

నేడు నక్కలదిన్నెలో వైద్య శిబిరం

చాపాడు : నక్కలదిన్నె గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో హోలిస్టిక్ హాస్పిటల్ బృందంచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గ్రామ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

‘దళితులపై కొనసాగుతున్న వివక్ష’

పోరుమామిళ్ల : బద్వేలు నియోజకవర్గంలో శాసనసభ సీటు ఎస్సీగా రిజర్వేషన్ జరిగి 25 ఏళ్లు అవుతున్నా దళితుల అభివృద్ధి జరగలేదని, దళితుల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉందని దళిత గిరిజన జేఏసీ నాయకులు ఆరోపించారు. శనివారం పోరుమామిళ్లలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో వివిధ సంఘాలకు, పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు ప్రసాదరావు, బాలస్వామి, రమణ, ఓబయ్య, ఈశ్వరయ్య, రవికుమార్, సునీల్‌కుమార్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు నారాయణ, ఓబులేసు, జయరాజు, లక్ష్మి, చెంద్రాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నచూపు తగదు

ప్రొద్దుటూరు కల్చరల్ : మున్సిపాలిటి పరిధిలోని 16వ వార్డు ఆదర్శనగర్ దళిత కాలనీపట్ల మున్సిపల్ అధికారుల చిన్నచూపుతగదని దళిత సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదర్శ కాలనీలోని నరసింహస్వామి ఆలయం వద్ద గత కొన్ని నెలలుగా రోడ్డు పై మురికి నీరు నిలుస్తుండటంతో శనివారం దళిత సంఘాల నాయకులు మురికి నీటిలో నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యల్లయ్య మాదిగ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ మురికినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేదంటే ఈ నెల చివరి సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నరసింహస్వామి ఆలయ చైర్మన్ నరసింహస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల రాజా, జిల్లా అధ్యక్షుడు గడ్డం నరసింహ, నారాయణ, బాబు, రవికుమార్ మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.